క్లుప్తంగా

నానో యూరియా వినియోగించండి
రైతులకు కలెక్టర్ లక్ష్మీశ సూచన



తిరువూరు: పంటల సంరక్షణకు, అధిక దిగుబడికి నానో యూరియాను వినియోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రైతులకు సూచించారు. తిరువూరు మండలంలోని ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘాల్లో యూరియా సరఫరాను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు యూరియా కొరత గురించి ఆందోళన చెందవద్దని, ప్రత్యామ్నాయంగా నానో యూరియాను పంటలకు వేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. తిరువూరు ఆర్డీఓ మాధురి, ఏడీఏ రంగారావు, ఏఓ పద్మ, ఎంపీడీఓ రవిబాబు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీపురంలో డ్రోన్‌తో నానో యూరియాను పంటలపై వినియోగించే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో యూరియా తరలిపోకుండా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను కలెక్టర్ తనిఖీ చేశారు.

భూమి స్వభావం మార్పునకు దరఖాస్తుల ఆహ్వానం



ముసునూరు: అడంగల్‌లో భూమి స్వభావం పట్టాకు బదులు చెరువుగా నమోదైన రైతులంతా మార్పు కోసం అర్జీలు అందజేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లి సచివాలయం వద్ద తహసీల్దార్ డి.ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించి, గ్రామంలోని బాధిత రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని 166 మంది రైతుల భూమి స్వభావం వివరాలు అడంగల్‌లో పట్టాకు బదులు చెరువుగా నమోదైందని, దీని పరిష్కారం కోసం అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. గ్రామంలోని బాధిత రైతులు అర్జీలు అందించి, సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. 60 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించామని, శుక్రవారం వరకు అర్జీలు స్వీకరిస్తామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. ఆర్ఐ వెంకట శ్రీనివాస్, వీఆర్వోలు కనకమ్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పోక్సో చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మైలవరం ఐసీడీఎస్ సీడీపీఓ కె.పుష్పలత అన్నారు. పోక్సో చట్టం, పనిప్రదేశాల్లో మహిళల భద్రత, చిన్నారులపై లైంగిక వేధింపులు వంటివి ఈ చట్టం కిందకు వస్తాయని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొండపల్లిలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలు, చిన్నారులు ఈచట్టం కింద రక్షించబడతారన్నారు. పని ప్రదేశాల్లో సైతం వేధింపులకు గురికాకుండా మహిళలు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిషన్ శక్తి జిల్లా అధికారి భార్గవి, పీఓ దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్లు శివకుమారి, మాధవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ఆదరించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ నిర్వహించారు. హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయుడు సురేష్, ఐఈఆర్ టీచర్లు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షులకు శిక్షణ

తిరువూరు: తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులకు శిక్షణ తరగతులు తిరువూరులో మంగళవారం ప్రారంభమయ్యాయి. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సహకార సంఘాల నిర్వహణలో పాలకవర్గాల పాత్ర, రైతులకు పీఏసీఎస్‌లలో అందించాల్సిన సేవలను ఆయన వివరించారు. శిక్షణ తరగతుల్లో ఎన్టీఆర్ జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, సీఈఓ మనోహర్, జీఎం రంగబాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ ప్రణాళికలకు కసరత్తు

చాట్రాయి: గిరిజన గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఐటీడీఏ ఎంఈఓ కె. ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం పోతనపల్లి పెద్ద తండాలో ఆది కర్మయోగి పథకంలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. పలు శాఖల ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నట్లు ఆయన చెప్పారు. ఎంఈఓ-2 బ్రహ్మాచారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు నుంచి నందిగామ వెళుతున్న స్వామిదాసు, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నందిగామకు ర్యాలీగా బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఇబ్రహీంపట్నంలో అన్నదాత పోరుకు బయలు దేరిన ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు



ఇబ్రహీంపట్నంలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జోగి రమేష్ తదితరులు

కదంతొక్కిన రైతన్నలు

- అన్నదాత పోరుకు వెళ్లకుండా జోగి రమేష్, నాయకులను అడ్డుకున్న పోలీసులు
- ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో కొద్దిసేపు ఉద్రిక్తత
- మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

ఇబ్రహీంపట్నం/తిరువూరు/నూజివీడు: రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ వైఫల్యం, రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నందిగామలో అన్నదాత పోరుకు మైలవరం, తిరువూరు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పలుచోట్ల రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకున్న పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్, నాయకులు

మాజీ మంత్రి జోగి రమేష్‌ను అడ్డుకున్న పోలీసులు

రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి నందిగామ ఆర్డీఓ కార్యాలయానికి బయలుదేరిన మాజీ మంత్రి జోగి రమేష్, ఇతర నాయకులను ఇబ్రహీంపట్నంలో మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళుతున్న నేతలను రింగ్ సెంటర్‌లో బారికేడ్లు పెట్టి నిలువరించారు. రైతుల సమస్యలపై వెళుతుంటే దౌర్జన్యం చేయడం ఏమిటని పోలీసులను నాయకులు ప్రశ్నించారు. పది మందితోనే నందిగామ వెళ్లాలని సీఐ చంద్రశేఖర్ మాజీ మంత్రి జోగి రమేష్‌కు సూచించారు. పార్టీ నాయకులతో కలిసి వెళ్లాలని జోగి రమేష్ పట్టుబట్టారు. ఈ పరిణామంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నాయకులు, పోలీసుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి.

పోలీసుల తీరుకు నిరసన

ఆంక్షలతో రైతుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని జోగి రమేష్ మండిపడ్డారు. పోలీసుల తీరుతో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని కూటమి ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు, సీఎం చంద్రబాబు కుతంత్రాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి రైతుల పక్షాన వినతిప్రతం అందజేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ: జోగి రమేష్

ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ అన్నదాత కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రైతుల పక్షాన నందిగామకు వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. యూరియా కోసం హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయమని చెప్పే స్థితికి ప్రభుత్వం దిగజారిందన్నారు. రైతులు యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చోలేక తమ చెప్పులు లైన్‌లో పెట్టుకునే పరిస్థితికి సీఎం చంద్రబాబు దిగజార్చారని విమర్శించారు. ఒక పక్క అన్నదాత సుఖీభవ పేరుతో తొలి ఏడాది నగదు ఎగొట్టారని, మరో పక్క అన్నదాతను యూరియా కోసం క్యూలైన్‌లో ఇబ్బందులకు గురి చేశాడన్నారు.



నూజివీడులో అన్నదాత పోరుకు తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



గంపలగూడెం మండలం మధిర రోడ్డులో పోలీసుల ఆంక్షలకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన నాయకులు

ఒకపక్క అక్కచెల్లమ్మలు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడుతుంటే, మరో పక్క ఆడబిడ్డ నిధికోసం మహిళలు ఎదురు చూస్తున్నారని ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. చంద్రబాబు మాత్రం సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పడం అన్నివర్గాలను మోసం చేయడమేనని విమర్శించారు. ఇంటింటికి పథకాలు అందించిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని, ఇంటింటికి మద్యం డోర్ డెలివరీ చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. కూటమి మోసాలు భరించలేని ప్రజలు మరలా సీఎంగా జగనన్న వస్తే బాగుండని చెప్పుకుంటున్నారని స్పష్టం చేశారు. జగనన్న ప్రభుత్వంలో రైతు భరోసా, పంటలకు గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అందించారని గుర్తు చేశారు. మీది కూటమి ప్రభుత్వం కాదని కుట్రల ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం రైతుల ఉద్యమాలను అణచివేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రమ్మంటున్న మీరు పార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జికొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, వివిధ విభాగాల నేతలు మిక్కిలి శరభయ్య, పోరంకి శ్రీనివాసరాజు, గుంజా శ్రీనివాస్, బి.రవికిశోర్, జడ రాంబాబు, రెంటపల్లి నాగరాజు, బాణావత్ బాలాజీ, నల్లమోతు దయాకర్, ప్రకాష్, జి.రాణి, జి.రాంబాబు, పఠాన్ నాగుల్‌మీరా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగడుగునా అడ్డంకులు

జి.కొండూరు: యూరియా కొరతపై వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ప్రత్యేక చెక్‌పోస్టులు పెట్టి ప్రధాన నాయకులు, పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. జి.కొండూరు మండల పరిధిలోని కట్టుబడిపాలెం వద్ద పోలీసులు మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్నాల తిరుపతిరావు, ఇతర నాయకులను అదుపులోకి తీసుకొని కార్యక్రమానికి హాజరుకాకుండా అడ్డుకున్నారు. దీనిపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ శాంతియుతంగా చేపట్టిన నిరసనకు వెళ్లకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమన్నారు. రైతులకు యూరియా అందించలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేస్తే, ఈ ప్రభుత్వం రైతన్నలను రోడ్డెక్కిచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అసత్యపు మాటలు మాని రైతులకు సరిపడా యూరియా అందించాలని హితవు పలికారు.



కట్టుబడిపాలెం వద్ద అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్నాల తిరుపతిరావుని నిర్బంధించిన పోలీసులు

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నూజివీడు: రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా ఆంక్షలు పెట్టినప్పటికీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఏనాడు రైతాంగం సంతోషంగా లేరన్నారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎవరైనా యూరియా కోసం రోడ్డెక్కితే బొక్కలో వేస్తానంటూ మాట్లాడుతున్న చంద్రబాబుకు రానున్న రోజుల్లో రైతులు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ ఏడాది నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతులు దిగుబడికి ధర లేక దారుణంగా నష్టపోయారన్నారు. చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వం నూజివీడు ప్రాంతంలోని రైతులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైఎస్సార్ సీపీ ముసునూరు మండలాధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడారు. అనంతరం పోలీసులు ఆంక్షలు పెట్టడంతో రైతు విభాగం అధ్యక్షుడు ఈలప్రోలు వెంకటసుబ్బయ్య నేతృత్వంలో పలువురు నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ముసునూరు, ఆగిరిపల్లి ఎంపీపీలు కొండా దుర్గాభవాని, గోళ్ల అనూష, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, మండల, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ, బెజవాడ రాంబాబు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఆగిరిపల్లి జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బాణావతు రాజు, మున్సిపల్ విభాగం ఇన్‌చార్జి మలిశెట్టి బాబీ, యువజన విభాగం జిల్లా కార్యదర్శి పత్తిపాటి సురేష్ (జోజి) తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతుల తరఫున పోరాటం..

మైలవరం: అన్నదాత పోరు కార్యక్రమానికి మైలవరం నుంచి వైఎస్సార్ సీపీ మండల నాయకులు, పట్టణ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జి.వెంకట్రావు, పాలా నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతుల తరఫున అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రైతుల తరఫున పోరాడతామన్నారు. కార్యక్రమానికి వెళుతున్న వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలకు రహదారిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డగించి, వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో ఎక్కువ మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉంటే పోలీసులు ఆ వాహనాలను వెనక్కి తిప్పి పంపించే ప్రయత్నం చేశారు. రహదారిలో పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికి కార్యకర్తలు అన్నదాత పోరుకు తరలివెళ్లారు.

దారులన్నీ నందిగామ వైపునకు..

తిరువూరు: యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నందిగామలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి తిరువూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులు, రైతు నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. తిరువూరు నుంచి మధిర రూటులో గంపలగూడెం మండలం రాజవరం వద్ద పోలీసులు అధిక సంఖ్యలో మోహరించి అన్నదాత పోరుకు వెళ్లే వాహనాలను నిలిపివేశారు. ముఖ్య నాయకులను మాత్రమే నందిగామ వెళ్లడానికి అనుమతిస్తామని పోలీసులు తెలుపగా, వైఎస్సార్ సీపీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించాయి. రైతుల పక్షాన తాము పోరాడేందుకు వెళ్లితీరతామని పోలీసు ఆంక్షలను సైతం లెక్కచేయకుండా బయలుదేరి వెళ్లారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, భూక్యా గన్యా, గద్దల శామ్యూల్, పార్టీ నాయకులు నరెడ్ల వీరారెడ్డి, కోట దాసు, తాళ్లూరి నవీన్, కలకొండ రవికుమార్, కాలసాని గోపాల నాగేశ్వరరావు, తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, బొర్రా మోహనరావు, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, బండారు పద్మావతి, బండి రవికుమార్, కావూరి వినయ్‌కుమార్, వెదురు గోపిరెడ్డి, మామిడి కుటుంబరావు, ముక్కామల సీతారామయ్య, చెన్ను కృష్ణప్రసాద్, చావా వెంకటేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం
రైతు సంఘం నేతల ధ్వజం

మైలవరం: రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, పీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. మైలవరం ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం సమావేశం జరిగింది. ఆంజనేయులు మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక లేకుండా ఎరువులను రైతులకు సకాలంలో సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు ఎరువులను బ్లాక్ చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్‌లో రైతులు ఎక్కువ ధరకు కొనలేక, సకాలంలో ఎరువులు పంటలకు వేయలేక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఎరువుల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. యూరియా కోసం రైతులు ఆర్‌బీకేలు, సొసైటీల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారన్నారు. యూరియాను బ్లాక్ చేసి దాని స్థానంలో నానో యూరియాను వాడాలని రైతులను మభ్యపెడతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఆళ్ల అమ్మిరెడ్డి, సాంబారు వెంకటేశ్వర్లు, వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. గుంటుపల్లి, ఈలప్రోలు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నానో యూరియా ఉపయోగాలను వివరించి, స్ప్రే చేయడం వలన నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా వాడాలని, రెండో దఫా, మూడో దఫాగా నానో యూనియా వాడుకోవాలని చెప్పారు. అందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఓ యడవల్లి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్టీయూ

మైలవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. బసవయ్య డిమాండ్ చేశారు. మైలవరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ సుంకిరెడ్డి, మండల ప్రెసిడెంట్ ఇందిర, మండల ప్రధాన కార్యదర్శి పి.రవిబాబు, మండల గౌరవాధ్యక్షులు ఎస్కే జాఫర్, ఉపాధ్యాయిని కేవీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఏకనామ సంకీర్తన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి జన్మనక్షత్రంను పురస్కరించుకుని కొండపల్లి శ్రీ మద్విరాట్ విశ్వకర్మ దేవాలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఏకనామ సంకీర్తన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు నిడమానూరు గ్రామానికి చెందిన బాబురావు భక్త బృందం ఉదయం 6 నుంచి సాయత్రం 4 గంటల వరకు ఏకనామ సంకీర్తన జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ట్రస్టీ కత్తురోజు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

నవ భారత నిర్మాణంలో గురువుల పాత్ర ప్రధానం



ముసునూరు: నవ భారత నిర్మాణంలో గురువుల పాత్ర ప్రధానమని ఎంఈఓ-1 సుభాషిణి, ఎంఈఓ-2 బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు మానవ వనరుల కేంద్రంలో మండల టీచర్స్ యూనియన్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురు పూజా మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన టీచర్లను, పలువురు సీనియర్ టీచర్లను సన్మానించారు. మండల యూనియన్ల నేతలు గాంగేయుడు, పద్మ కిశోర్, కంచర్ల నాగేశ్వరరావు, సాయిబాబు, బాబూరావు, పుల్లయ్య, జీవీ రత్నం, ఉదయభాస్కర్, శేఖర్, నారాయణ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తగిన మోతాదులోనే ఎరువులు వాడాలి



ముసునూరు: పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడాలని, అధిక ఎరువులు వాడి ఇబ్బందులు పడవద్దని మండల వ్యవసాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, చెక్కపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు యూరియా పంపిణీ సరళిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధిక మోతాదులో యూరియా వాడితే పంటను చీడ పీడలు ఆశించే ప్రమాదం ఉందన్నారు. వరి, అరటి, ఆయిల్‌పామ్ పంటకు వాడాల్సిన మోతాదును వివరించారు. ఆయిల్ పామ్, పండ్ల తోటల్లో నానో యూరియాను డ్రిప్ పద్ధతి ద్వారా వాడుకోవచ్చన్నారు. అనంతరం వరి పంటను క్షేత్ర పరిశీలన చేశారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలి
ఉద్యాన శాస్త్రవేత్త కాళిదాసు



నూజివీడు: సుస్థిర వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ తోటల్లో మిశ్రమ పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఉద్యాన శాస్త్రవేత్త కాళిదాసు పేర్కొన్నారు. మండలంలోని దేవరగుంటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కాళిదాసు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో మిశ్రమ పంటలుగా వక్క, అరటి, కోకో, లాంగ్ పేపర్ సాగు చేసుకోవచ్చన్నారు. ఆదర్శ రైతులు ప్రసాద్, నాగభూషణం మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రతి రైతూ ఆదర్శ రైతుగా మారాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ యూరియాను తగిన మోతాదులో మొక్కలకి అందించాలన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయమైన నానో యూరియా లేదా ఇతర సేంద్రియ ఎరువులను ఉద్యాన పంటలకు అందించాలని సూచించారు. ఏడీఏ జి. విద్యాసాగర్, ఉద్యాన అధికారి ఆర్. హేమ, వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.